క్లుప్తంగా

దళిత మహిళల నిరసన



నడికూడ : ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆ శాఖ అధికారులు కొద్ది రోజులుగా ప్రకటిస్తుండడంతో మండలంలోని పులిగిల్ల, చర్లపల్లి గ్రామాలకు చెందిన దళిత మహిళలు మండల కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వమే విద్యుత్ మీటర్లు అందించి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నినాదాలు చేశారు.

విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి

ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆ శాఖ ఏఈ కె.విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ కనెక్షన్ కోసం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ ప్రతాలు అందజేసి మీటర్లు ఏర్పాటు చేసుకుంటే నెలకు 101 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగం చౌర్యం కిందకు వస్తుందని, అలా చేయడం చట్టరీత్యా నేరమని వివరించారు. విద్యుత్ మీటర్లు లేని ఎస్సీ, ఎస్టీలందరూ మీటర్లు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం



ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రైతులు జక్కుల రాజు, తెల రవిలకు చెందిన గడ్డివాము, మొక్కజొన్న పంట, వ్యవసాయ మోటార్ పైపులు విద్యుదాఘాతానికి గురై సోమవారం దగ్ధమయ్యాయి. విద్యుత్ వైర్లు వేలాడుతుండడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని రైతులు తెలిపారు. విద్యుత్ వైర్లను సరైన రీతిలో ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న వైర్లను పైకి జరపాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోకపోవడం వల్లే విద్యుదాఘాతం చోటు చేసుకుని తమకు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, అవసరమైన చోట అదనంగా స్తంభాలు ఏర్పాటు చేయాలని, నష్టానికి సంబంధించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'బలగం' సినిమా ప్రదర్శన

దామెర : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో శ్రీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పాటు చేసి 'బలగం' సినిమాను సోమవారం ప్రదర్శించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సినిమాను తిలకించారు. పలువురు సినిమా చూస్తూ కంటతడి పెట్టడం కనిపించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్, స్థానిక సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి స్విచ్ ఆన్ చేసి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. ×బలగం€ చిత్రం మానవ సంబంధాలను కళ్లకు కడుతోందని చెప్పారు. సమాజంలో ఉమ్మడి కుటుంబాలను విలువను గుండెకు హత్తుకునేలా చూపించారంటూ దర్శకుడిని, సినిమా యూనిట్‌ను కీర్తించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ మాదారపు రతన్‌కుమార్, బీజేపీ నాయకులు రమేష్, సండెసారి సంతోష్, మేరుగు శ్రీను, దామెరుప్పుల దేవేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు



శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శివ మార్కండేయ ఆలయ సముదాయాల్లో ఈనెల 23 నుంచి దశమ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఆవరణలో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, అర్చకుడు మార్త రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రానికి నేడు (మంగళవారం) హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సర్వమతాలకు సమన్యాయం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర : బీఆర్ఎస్ పాలనలో సర్వమతాలకు సమన్యాయం అందిస్తున్నట్టు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గాలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ తోఫాలు పంపిణీ చేసి మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని మతాల పండుగల సందర్భంగా పేదలకు కానుకలు ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. పేద ముస్లిం కుటుంబాలు సైతం రంజాన్ పర్వదినాన్ని కుటుంబ సమేతంగా ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిములకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాము, ఏసీపీ శివరామయ్య, సైలానీ బాబా దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్, తహసీల్దార్లు రియాజుద్దీన్, సురేష్ కుమార్, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ఎంపీడీఓలు వేంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ యాదగిరి, దళితబంధు చైర్మన్ కృష్ణమూర్తి, ఓగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్ పాల్గొన్నారు.



దామెర : తోఫాలు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మైనార్టీల సమగ్రాభివృద్ధికి కృషి

శాయంపేట : మైనార్టీల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని మదీనా మసీదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలకులు ముస్లింల సంక్షేమానికి విస్మరించి స్వార్థ పాలన సాగించారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్టు తెలిపారు. మైనార్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అనంతరం పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు, లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తొలుత ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, సర్పంచ కందగట్ల రవి, ఉపసర్పంచ్ సుమన్, తహసీల్దార్ చలమల్ల రాజు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఆర్ఐ శరత్ కుమార్ పాల్గొన్నారు.



శాయంపేట : ఇఫ్తార్ విందులో జెడ్పీ చైర్‌పర్సన్

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



ఐనవోలు : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్



నడికూడ : కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

● ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు : బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన బొంత జీవన్, పల్లకొండ ఎల్లయ్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తూనే అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అనారోగ్యం బారిన పడి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న జీవన్‌కు రూ.15 వేల, ఎల్లయ్యకు రూ.40 వేల సాయం మంజూరైనట్టు చెప్పారు. పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, ఐనవోలు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, నాయకులు బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

నడికూడ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొక్కిరాల దేవేందర్ సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దేవేందర్‌కు ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు దుర్శెట్టి చందు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోండి

శాయంపేట : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద చేపడుతున్న పనులను జాబ్ కార్డ్ కలిగిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ సూచించారు. మండల కేంద్రంలోని నల్లకుంట్ల చెరువులో చేపట్టిన పూడికతీత పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ పేద కూలీలకు ఉపాధి కల్పించేలా పనులు చేపడుతోందని చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధన మేరకు ఉదయం వేళల్లోనే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీటి, ఇతర వసతులు కల్పించాలని సుమన్ కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రేణికుంట్ల సదయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ దైనంపల్లి వసంత, సీనియర్ మేట్ పాపయ్య, మారపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్ సుమన్

టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

పరకాల : తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి డాక్టర్ జె.చిన్న సోమవారం వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడుగా ప్రొఫెసర్ డి.వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మాదారపు రవికుమార్, ఉపాధ్యక్షురాలు, కోశాధికారిగా శిరీష, రాష్ట్ర కౌన్సిలర్‌గా డాక్టర్ డి.రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేస్తామని ఎన్నికల అధికారి డాక్టర్ జె.చిన్న ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కమిటీ

బాలసముద్రంలో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని కుడా మైదానంలో ఫన్ అండ్ జాయ్ వాటర్ టన్నెల్ ఫిష్ మ్యూజియం, ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు సాయంత్రం వేళ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఎగ్జిబిషన్ దోహదపడుతుందని అన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అస్లాం మాట్లాడుతూ నగరవాసుల కోసం ఈసారి 500 రకాల సముద్ర జలచరాలతో అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ అక్వేరియం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కలంకారి, చేనేత, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, ఇమిటేషన్ జ్యువెల్లరీ, లెదర్ గూడ్స్, రుచికరమైన కలకత్తా చాట్ బండార్, సిమ్లా మిర్చి, ఢిల్లీ పాపడాల విక్రయాలకు 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, మేనేజర్లు డి.రాజేంద్రప్రసాద్, ఫిరోజ్, కార్పొరేటర్ రావుల కోమల, నాయకులు పాల్గొన్నారు.

దళితరత్న ప్రవీణ్‌కుమార్‌కు అభినందనలు

హన్మకొండ: దళితరత్న అవార్డు గ్రహీత కవి, గాయకుడు, రచయిత, బాలల పరిరక్షణ అధికారి సొరం ప్రవీణ్‌కుమార్ (కళాశ్రీ)ను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు అధికారులు అభినందించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌కు దళితరత్న అవార్డును ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్, ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఎస్.రాజు ఉస్తాద్, అంబేడ్కర్‌వాది జేబీ రాజు అందజేశారు. కాగా, కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను కలెక్టర్ పట్నాయక్‌తో పాటు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత, ఎస్సీ అభివృద్ధి అధికారి నిర్మల, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



ప్రవీణ్ కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామ శివారులో పరకాల–హుజురాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. కమలాపూర్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మామిడాల సురేష్ తన ద్విచక్ర వాహనంపై పరకాల నుంచి గోపాల్‌పూర్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సురేష్ గాయాల పాలు కాగా స్థానికుల సాయంతో అతడ్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి రూ.70 వేల సాయం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నాగరాజు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్ సోషల్ మీడియా వేదికగా రూ.70 వేలు సేకరించి సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు వావిలాల వేణుగోపాలస్వామి, మాచర్ల మంగమ్మ రవి చేతుల మీదుగా సోమవారం రూ.60 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్, రూ.10 వేల నగదుతోపాటు 50 బియ్యం అందించారు. అనంతరం అశోక్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌కు చెందిన నాగరాజు బతుకుదెరువు కోసం మండలానికి వచ్చి పెద్దకోడెపాకలో కుటుంబంతో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడని తెలిపారు. ఆరోగ్య సమస్యలతో నాగరాజు ఆత్మహత్య చేసుకోగా అతడి భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని చెప్పారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా ఆటోడ్రైవర్లు, దాతలు, గ్రామస్తుల నుంచి రూ.70 వేల విరాళాలు సేకరించినట్టు తెలిపారు. ప్రభుత్వం నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నియామకం



ధర్మసాగర్ : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన మోటె యామినిని నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో యామిని విలేకరులతో మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. మహిళలను చైతన్యవంతం చేసే దిశగా పాటుపడతానని చెప్పారు. తనకు పదవి ఇప్పించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగాపురం ఇందిర, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వేలం

ఆత్మకూరు : రేపు (బుధవారం) మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న రెండు గదులకు వేలం నిర్వహించనున్నట్లు ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారస్తులు పాల్గొనాలని సూచించారు.

నమాజ్ ఈద్గాలో పరిశుభ్రత

పరకాల : రంజాన్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలో మున్సిపల్ సిబ్బంది సోమవారం పరిశుభ్రత పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి ఆదేశాల మేరకు ముళ్లపొదలను, చెత్తాచెదారాన్ని డోజరత్‌తో తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ముఫీనా ఫాతిమాహమీద్, శానిటేషన్ ఆఫీసర్ జి.వెంకట్‌రెడ్డి, వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షుడు అజ్గర్ అలీ, షౌకత్, దావూద్, జవాన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రత పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

● హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్

ధర్మసాగర్ (వేలేరు) : పేదల అభివృద్ధి, సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్ తెలిపారు. వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, 'మన ఊరు–మన బడి'లో భాగంగా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో రూ.16.52 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను, రెండో విడత కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సీఎం కేసీఆర్ రైతుల, ఉద్యోగుల, కార్మికుల, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. రైతులు దళారుల బారిన పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి సరైన ధర పొందాలని సూచించారు. అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం కంటి వెలుగు చేపట్టిందన్నారు. 'మన ఊరు–మన బడి' పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెంది పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం అందుబాటులోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్, ఎంపీపీలు కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జక్కుల అనిత, సర్పంచ్ గూడ కవిత, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, మండల నోడల్ ఆఫీసర్ మహేష్ నాయక్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్‌పర్సన్ స్వాతి, హెచ్ఎం గణపతి నాయక్, కోఆర్డినేటర్, సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పద్మశాలీలు ఉన్నత స్థాయికి ఎదగాలి

● డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవికి సన్మానం

పరకాల : పద్మశాలీ కులస్తులు ఉన్నత స్థాయికి ఎదగాలని పద్మశాలీ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) అధ్యక్షుడు డాక్టర్ పోతాని రాజేశ్వర్ ప్రసాద్ ఆకాంక్షించారు. పట్టణానికి చెందిన డాక్టర్ కె.లలితాదేవి కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన సందర్భంగా ఆ సంఘం పరకాల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వర్ ప్రసాద్ మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి పద్మశాలీ కులస్తుల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు, సీనియర్ వైద్యుడు డాక్టర్ వినయ్, సీనియర్ జర్నలిస్టు మెండు రవీందర్, నాయకులు మార్త రాజేందర్, అడికాల శ్రీనివాస్, దాసరి రమేష్, ఆడెపు కుమారస్వామి, దార్న కుమారస్వామి, రంగు చందర్ పోపా మహిళ సభ్యులు బాసాని సుధ, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న రాజేశ్వర్‌ప్రసాద్, తదితరులు

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

ఎల్కతుర్తి : అంధత్వ రహిత సమాజ నిర్మాణం కోసమే సీఎం కేసీఆర్ 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు రత్నగిరి సర్పంచ్ వంగ సురేష్ తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడి వయస్కులైన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించి లోపమున్న వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎంపీటీసీ సట్ల రఘుపతి తదితరులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేష్

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

● టీఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య

శాయంపేట : ఐక్యతతో ఉంటేనే సమస్యలు పరిష్కారమౌతాయని టీఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చందా మల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో సోమవారం నిర్వహించిన పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్మశాలీ కులస్తులు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో రాణించేలా ఐక్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పది మంది సభ్యులతో మండల అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వావిలాల వేణుగోపాల ప్రసాద్, కోకన్వీనర్‌గా కందగట్ల ప్రకాశ్, సభ్యులుగా సామల మధుసూదన్, భిక్షపతి, పల్నాటి జలంధర్, దుంపేటి రమేష్, బాసాని లక్ష్మీనారాయణ, గుర్రం అశోక్, అల్లె రాజీరు, బూర ఈశ్వరయ్య, పైడీలను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీలను ఎంపిక చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, పీఏసీఎస్ డైరెక్టర్ దిడ్డి ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన వంగల వీరాచారి, ఆరెల్లి రమేష్, పార్శ కృష్ణమూర్తి, బంగారు మల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు సోమవారం పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబాలకు ఆర్థికసాయం అందించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బయ్య రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, యూత్ విభాగం మండల ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, అలువాల రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నాగనబోయిన కట్టమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వేముల నవీన్ పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళలు

హన్మకొండ: సుబేదారి–కాజీపేట ప్రధాన రహదారిలో తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. సంప్రదాయంతో పాటు ఫ్యాషన్ ఉట్టిపడే వస్త్ర ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారులు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులు సిల్క్, కాటన్‌తో పాటు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ సారీస్, లినెన్ చీరలు, కలంకారి, బెంగాల్ కాటన్, వన్‌గ్రాం గోల్డ్ జ్యువెలరీ ఆకట్టుకుంటున్నాయి. ప్రవేశం ఉచితమని, వారం రోజులు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.